# 20

# నిద్రించే అగ్నిపర్వతం

ఆర్మీ గ్రౌండ్స్ -

విశాలమైన మైదానంలో ఎన్నో వాహనాలున్నాయి. అన్నీ పాతవే. వాడబడి హర్రాజు చేయడానికి సిద్ధంగా ఉన్నవి. కార్లు, జీపులు, డోజర్స్, టిప్పర్స్, వ్యాన్స్ ఎన్నో-

అప్పటికే రెండు మూడుసార్లు ప్రముఖ పత్రికలన్నింటిలోనూ ప్రకటించబడి, ఆరోజు హర్రాజు కోసం ఏర్పాట్లు చేయబడి,

లక్షరూపాయల విలువైన సామాగ్రిని వీలున్నంత తక్కువ ధరలో తన్నుకు పోయేందుకు మూలమూలల నుండి వ్యాపారులొచ్చి గుంపులు గుంపులుగా అక్కడక్కడ నిలబడి అవలంబించవలసిన పంథా గురించి చర్చించుకుంటున్నారు.

అంటే అందరూ కూడబల్కుకుని, వీలుంటే ఆక్షనింగ్ అధికారికి కూడా కొంత మొత్తమివ్వ జూపి ఏ నలుగురైదుగురో నామమాత్రం పాట పాడి హర్రాజు అయిందనిపించి - తర్వాత మళ్ళీ వ్యాపారులు వీళ్ళలో వీళ్ళు ఆక్షన్ చేసుకుని చిట్టచివరగా కొన్నవాని దగ్గర నుండి పొందే లాభాన్ని రింగయిన మనుషులందరూ సమానంగా పంచుకుని ఎవరి దారినవారు వెళ్ళిపోవడం. తీరిగ్గా అందరూ ఎంతో కొంతపొందే సూడో సోషలిస్టిక్ చీటింగ్ యిది.

ఎవరో ఓ పెద్దమనిషి 'రింగ్' కాదల్చుకున్న వాళ్ల పేర్లను ఓ కాగితంపై రాయడం మొదలెట్టాడుకూడా.

సరిగ్గా ఆ సమయానికి ఓ నిస్సాన్‌కారు పూలపడవలా ఆ ప్రాంగణంలోకి చొచ్చుకొచ్చి ఆగింది. ఆగినదాంట్లో నుండి ఫుల్‌సూట్లో ఉన్న రంగనాథరావు చేతిలో బంగారు కీచైన్‌తో దిగి పరిసరాల నొకసారి పరికించి, యింకో ఐదునిమిషాల్లో జరుగబోయే హర్రాజులో తను ఎదుర్కోవలసిన ప్రత్యర్థులను ఒక్కచూపుతో అంచనా వేసుకుని నోట్లు నింపి ఉన్న బ్రీఫ్ కేస్‌నుచేతిలోకి తీసుకుని షామియానా వైపు నడిచాడు.

'రింగ్' కావాలని ఉత్సాహపడ్తున్న చిల్లర వర్తకబృందం అదిరిపోయి, హడలిపోయి - "దేగొచ్చింది. పిట్టలం.. యిక లాభంలేద్గురూ" అంటున్నారెవరో..

కెప్టెన్ రంజిత్‌సింగ్ చేతిలోకి మైక్‌ను తీసుకుని యిక హర్రాజు ప్రారంభించేందుకు ఆయత్తమౌతున్నాడు.

రంగనాథరావు గుండెలనిండా సంతృప్తిగా గాలిపీల్చుకుని, తన ధాటికి తట్టుకునేవాడెవడూ ఆ పరిసరాల్లో లేకపోవడంతో - తనదికాబోయే ఆ ఆక్షన్‌లో రాబోయే లాభాలను అంచనా వేసుకుంటున్నాడు.

'ఎస్.మైడియర్ ఫ్రెండ్స్ ..వెల్‌కం టు దిస్..' కెప్టెన్ కంఠం ఖంగుమంటోంది. ఆక్షన్‌లో వ్యాపారులు పరిగణనలోకి తీసుకోవాల్సిన అనేక వాహనాల లిస్టును ఏకరువు పెడ్తున్నాడు.

అందరూ నిశ్శబ్దంగా వింటున్నారు.

కెప్టెన్ పాల్గొనబోయే రిజిస్టర్డ్ బిజినెస్‌మెన్ పేర్లను వరుసగా చదువుతున్నాను.

మరోవైపు రంగనాథరావు కంప్యూటర్ బ్రెయిన్ లెక్కలు వేసుకుంటూ పోతోంది.

"సో.. గవర్నమెంట్స్ ఆఫర్.ఫిఫ్టీన్ లాక్స్....'

హర్రాజు ప్రారంభమయింది.

'సిక్టీన్ లాక్స్' ఎవరో.

"సెవెంటీన్..."

"నైంటీన్." ?

రంగనాథరావు మౌనంగా వింటున్నాడు నోట్లో డన్‌హిల్ సిగరెట్‌తో...

కాస్సేపు నిశ్శబ్దం..

'నైంటీన్ లాక్స్...' కెప్టెన్ కంఠం.

"ట్వంటీ..." మరెవరో.

"ట్వంటీ లాక్స్ ఫిఫ్టీ థౌజండ్"'.

"ట్వంటీ వన్"

పిల్లవ్యాపారుల గొంతుల్లో వెలక్కాయ పడి గుడ్లప్పగించి వింటున్నారు.

"ట్వంటీ టూ"

"ట్వంటీ త్రీ"

బ్రేక్ పడింది.

రంగనాథరావు నోట్లో వున్న, ఇంకా కాలాల్సిన సిగరెట్టును బూటు క్రింద నలిపి, మరోఫ్రెష్ సిగరెట్టును వెలిగించి ఓ దమ్ము లాగి...

" ట్వంటీఫైవ్ లాక్స్"అన్నాడు స్థిరంగా.

అందరూ అతని వంక తలలు త్రిప్పి..... గడ్డ కట్టిన నిశ్శబ్దం.

సరిగ్గా అప్పుడు ఓ టయోటా కారు మెరుపులా దూసుకొచ్చి...ఆగి,

ఓ మృదువైన, అందమైన,బంగారు గాజులు ధగధగ లాడుతున్న చేయి డోర్ తెరువగా - మోహనమురళి అని పిలువడే ముప్పయి ఐదేళ్ళ మగాడు మూర్తీభవించిన విశ్వాసంలా దిగి - చాలా తాపీగా చేతిలోని పైప్‌ని నోట్లో పెట్టుకుని లైటర్‌తో వెలిగించు

కుంటుండగా అతని సెక్రటరీ ఐన లీల కూడా దిగి ఓ ఫైల్‌ని అతని ఎదుట తెరచి చూపించింది.

'ట్వెంటిఫైవ్‌లాక్స్'' కెప్టెన్ కంఠం మ్రోగుతూనేఉంది.

రంగనాథరావు ముఖం కోపంతో ఆపిల్ పండులా మారింది. గమనిస్తున్నాడు. మోహన్ మురళి రాకను. ఉక్రోషం కట్టలు తెంచుకుంటోంది.

"ట్వంటీఫైవ్ లాక్స్"

"థర్టీ లాక్స్" అంది లీల బాస్ అనుజ్ఞతో.. రంగనాథరావు వీపుపై కొరడా దెబ్బ పడ్డట్టయి,

వాతావరణం నిండా గంభీరత అల్లుకుపోయి ఊపిరి బిగబట్టు కుని చూస్తున్నారందరూ. రంగనాథరావు మోహనమురళి ముఖంవైపు కసిగా చూచి, ఉక్రోషంతో

"థర్టీ టూ లాక్స్" అన్నాడు.

ఎవరూ ఊహించని అవధులను దాటుతోంది పాట.

"థర్టీ ఫైవ్" అంది లీల ఎంతో నెమ్మదిగా, హుందాగా.

ఓ ఆడదాన్ని తనకు ప్రత్యర్థిగా రంగంలోకి దింపి.. అవమానం, ఉడికిపోతున్నాడు రంగనాథరావు. అక్కసుతో అరిచాడు.

"థర్టీ సిక్స్"

"ఎయిట్"

"ఫార్టీ"

"ఫార్టీ టు'

మోహన మురళి పైప్‌లోని పొగాకునుప్యాక్‌చేసుకుంటున్నాడు తాపీగా టయోటాకు ఒరిగి.

"ఫార్టీ ఫైవ్" అరిచాడు రంగనాథరావు.

"ఫార్టీ ఎయిట్ " అంది లీల

"ఫిఫ్టీలాక్స్" రంగనాథరావు ముఖం నిండా రక్తం జిలజిలలాడుతోంది.

గడ్డకట్టిన మౌనం.

"ఫిఫ్టీ ఏక్ బార్"

లీల డోర్ తెరిచింది మోహనమురళి లోనికి ఎక్కి కూర్చున్నాడు.

'ఫిఫ్టీ లాక్స్ దో బార్"

"ఫిఫ్టీ లాక్స్ తీన్ బార్. మిస్టర్ రంగనాథరావు ద బిడ్డర్..." కెప్టెన్ మైక్‌లో ఆనందంగా ప్రకటిస్తున్నాడు.

టయోటా - మెత్తగా వెనుదిరిగి దుమ్మురేపుకుంటూ వెళ్ళిపోతోంది.

రెండు క్షణాల్లో హర్రాజు స్వరూపమే మారిపోయింది.

అందరూ షాక్‌లోంచి తేరుకుంటూ, రంగనాథరావు ముఖంలోకి జాలిగా చూడబోతుండగా, తెచ్చిపెట్టుకున్న నవ్వుతో బ్రీఫ్‌కేస్‌ను పట్టుకుని లేస్తున్న రంగనాథరావు ముఖం నిండా చెమటలు పోస్తున్నాయి.

ఐతే తను విజేత - అన్న భావం మాత్రం అతన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తూనే ఉంది.

ఫార్మాలిటిస్ అన్నీ పూర్తి చేసుకుని, ఓ పావుగంట తర్వాత రంగనాథరావు ఓ నంబర్‌ను డయల్‌చేసి -

మిస్టర్ మురళీ - "కొండతో తలపడితే తలపగుల్తుంది. బివేర్ నేనెప్పుడూ విజేతనే" అన్నాడు ఆవేశంగా.

సమాధానంగా ఏమీ వినిపించలేదు. ఒట్టి నవ్వు మాత్రం తెరలు తెరలుగా ముంచుకొచ్చి -

విసురుగా బయటికి నడిచాడు.

కారు డోర్ తెరుస్తుండగా డ్రైవింగ్ సీట్లో ఓ కవర్ కనిపించింది.

విప్పితే -

"నిన్ను అనవసరపు ఆవేశంలోకి దించి ఇరవైఐదు లక్షల నష్టాన్ని కలుగజేశాను. సరియైన ఎగ్జిక్యూటివ్ ఎప్పుడూ క్షణికమైన ఎమోషన్స్‌కు లొంగిపోడు. నీ ఒక్కొక్క రెక్కని నీకు తెలియకుండా విరిచేస్తాను. అప్పుడు ఎవరు విజేతో నీకు తర్వాత తెలుస్తుంది.

- మోహనమురళి" కాగితాన్ని కసిగా ఓ ఉండగా చుట్టి విసిరేశాడు.

కారు స్టార్టయింది.

=====

రంగనాథరావు ఆఫీస్‌లో కూర్చుని పదహారు గంటలు దాటిపోయింది. స్టాఫ్ వచ్చారు. పనిచేసుకున్నారు. డ్యూటీ అవర్స్ ఐపోగానే ఎక్కడి వాళ్ళక్కడ వెళ్ళిపోయారు. కాని అతను లేవలేదు. ఆఫీస్ గది వదలి బయటకు రాలేదు. ఆలోచిస్తున్నాడు. మెదడును సానబెడ్తూ ఆలోచనల్తో గాలిస్తూ పోతున్నాడు.

"ప్రత్యర్థి ముందు పడిపోకూడదు"

గదిలోకి వెళ్ళిన పి.ఎ. అదిరిపడ్డాడు. బాస్ ముఖం కందగడ్డలా ఉంది. నేలనిండా కాలిన సిగరెట్టు పీకలు రాలిపోయిన నక్షత్రాల్లా ఉన్నాయి.

మెహనమురళికి - తనకు యిప్పటిది కాదీ చాలెంజ్. దాదాపు పదిహేనేళ్ళ నాటిది. చిన్న విషయం మీద మాటపై మాటొచ్చి విడిపోయిన తామిద్దరు యిదివరకు ఎంతమంచి స్నేహితులో. అప్పుడు తనను గేలిచేస్తు స్కూటర్‌లో పెట్రోల్ పోసుకునే చేతకాక స్కూటర్నే తను అమ్ముకుంటానని జోస్యం చెప్పాడు. ఆ ఒక్కమాటను చాలెంజ్‌గా తీసుకుని తను లక్షలు సంపాదించి నిస్సాన్ కారును కొని ఎస్టేట్ ఓనర్‌గా ఋజువు చేసుకున్నాడు. జీవితాన్ని సవాలుగా తీసుకుని ఎదుగుతూ.. మురళిని తలదన్నాలని రేయింబవళ్ళు.. డామిట్... యిప్పుడు కథ అడ్డం తిరుగుతోంది.

తను యీ సెకండ్ హాండ్ వెహికిల్స్‌నీ, ఎర్త్ మూవర్స్‌నీ రిపేర్‌చేయించి అమ్ముతాననుకుని- నాకు నష్టాన్ని ఊహిస్తున్నాడు కాని

ఓ ఆలోచన తళుక్కున మెరిసింది.

బజర్‌నొక్కి పి.ఎ.ని రమ్మనాడు.

రాగానే -

"రేపు రంగనాథ్ కన్‌స్ట్రక్షన్స్ - అనే కంపెనీని రిజిష్టర్ చేయించు. మనం ఏ వన్ కాంట్రాక్టర్స్‌గా రంగంలోకి దిగబోతున్నాం" అని గబగబా బయటికి వెళ్ళిపోయాడు రంగనాథరావు.

"ఎవరికి ఎంత నష్టం కల్గిస్తున్నాం అని విచారిస్తూ బిజినెస్ చేసేవాడు ఎప్పుడూ ఎంటర్‌ప్రునర్ కాలేడు. కవర్డ్ ఔతాడు. మనం ఎంత సంపాదించి ఏ మేరకు సుఖపడ్తున్నామన్నది ప్రధానం కాదు. ఎంతమందికి జీవికను ప్రసాదిస్తున్నామనేది ముఖ్యం. నా ఆర్గనైజేషన్స్‌లో దాదాపు ఐదు వందల మంది బ్రతుకు గడుపుకుంటూ నన్ను దేవునిగా ఆరాధిస్తారు నీ గురించి నీవు ఆత్మాలోకం చేసుకో"

- రంగనాథరావు

మెహనమురళి ఉత్తరాన్ని చదివి ఆగ్రహోదగ్రుడై పోలేదు. చిర్నవ్వు నవ్వుకుని కాగితాన్ని ఓ ఫైల్‌లో భద్రపరిచాడు.

మెహన మురళీ ఇండస్ట్రీస్...

మోహన మురళీ సారథ్యంలో "జనని" దినపత్రిక...

మెహన మురళీ క్రియేషన్స్ పేరిట... సర్వ స్వతంత్ర్యమైన సినీ నిర్మాణ సంస్థ...

డబ్బు విద్యయి...విద్య విజ్ఞానమై.. లాభాలు జీవితాలై... జీవితాలు మమతలై.. మమతలున్న మనుషులు ఒక బహుళ కుటుంబ సభ్యులై.

ఓ కొత్త వ్యవస్థ,

ఓ కొత్తఒరవడి,

ఓ నూతన స్ఫూర్తి ఉద్భవించి -

కార్మికులు కూడా భాగస్వాములైన ఓ ఆదర్శ సంస్థ పుట్టి -

పనిచేసేవారు సంతుష్టులై యాజమానిని దేవునిలా ఆరాధించే మహత్తరమైన వ్యవస్థ రూపు దిద్దుకొని,

- ఆహూతులైన మంత్రులు,

ఎందరో ప్రముఖులు,

సినీ తారలు. పరిశ్రమాధిపతులు,

కిక్కిరిసిన జనం మధ్య - మంగళవాయిద్యాల నడుమ - వేదోక్త ఆశీర్వచనములతో...

మెహనమురళికి సన్మానం, అభినందన జరుగుతూండగా,

అతని కళ్ళు ఎదుట కూర్చుని ఉన్న వేల మనుషులను వెదుకుతున్నాయి.

మొక్క పెరగడానికి సూర్యరశ్మిని ప్రాణంగా స్వీకరిస్తుంది. ఐతే సూర్యుడెవరు. మొక్కఎవరు - మధ్య ఏమిటి ఆ ప్రాణప్రదమైన అనుబంధం.

సభ ప్రారంభమై -

కార్యక్రమం జరుగుతుండగా,

నడుమ -ముఖద్వారం గుండా వస్తూ రంగనాథరావు...

తనాశించినట్లుగానే తన పిఎ ఎదురేగి తోడ్కొని తీసుకొచ్చి, సముచితమైన చోట కూర్చుండబెట్టి,

-"నువ్వు తప్పకుండా వస్తావని తెలుసు నాకు" మోహనమురళి మనసు గొణిగింది.

మంగళవాద్యాల మోత సాగుతూనే ఉంది. మర్నాడే రంగనాథరావు సినిమా కంపెనీది కూడా ప్రారంభోత్సవం ఉంది... ఎంతో ఆట్టహాసంగా

కార్యక్రమం పూర్తికాకముందే రంగనాథరావు మౌనంగా వెళ్ళిపోయాడు.

===

"గుడ్ న్యూస్ సర్.. గంట క్రితమే ఢిల్లీ దగ్గర్లో ఏర్ క్రాష్ జరిగింది. కూలిపోయిన విమానంలో మన ప్రత్యర్థి మోహనమురళీ కూడా ఉన్నారు. ఈ రోజుతో వాడి చాప్టర్ క్లోజ్ సర్" అని ఆనందంగా చెప్పుకుపోతున్న పిఏను చూచి చెంప చెళ్ళుమనిపించాడు రంగనాథరావు.

"యిమ్మీడియేట్లీ వుయ్ షుడ్ గో టు డెల్హీ - కావలసిన ఏర్పాట్లు చూడు - గెటౌట్..." అన్నాడు అరుస్తున్నట్టుగా.

మరో రెండు గంటల్లో..

బలమైన గాయాలు తగిలి.. తలబద్ధలై.. దాదాపు అపస్మారక స్థితిలో ఉన్న మోహనమురళిని తొడపై పడుకోబెట్టుకుని ఇండియన్ ఇన్‌స్టిట్యూటాఫ్ మెడికల్ సైన్సెస్ దిక్కు కార్లో వెళుతున్న రంగనాథరావు కళ్ళనిండా పొంగి వస్తున్న కన్నీళ్ళను చూచి పిచ్చెక్కిపోయిన పిఏ కళ్ళలోకి చూస్తూ అన్నాడు -

జీవితంలో మోహనమురళేగనుక తటస్థపడి ఉండకపోతే... తను ఒక చాలెంజై అనుక్షణం నాలో ఆరిపోని ఉద్దీపనని రగిలించకపోతే.. నేనొట్టి నిద్రించే అగ్నిపర్వతాన్నే. శత్రువై ఎదుట నిల్చి కవ్వింపుతో నన్ను సవ్యసాచిగా మలచిన గురువితను.." చెప్పుకుపోతున్నాడు రంగనాథరావు.

మృత్యువుతో యుద్ధంచేస్తూ.. లిప్తకాల విరామంలో కళ్ళు తెరచిన మోహనమురళి కళ్ళ నిండా.... కన్నీళ్ళు...

రంగనాథరావు కళ్ళలో కూడా కన్నీరే....

'పల్లకి' వారపత్రిక

15-01-1987